'ఉద్యమించేందుకు వెనుకాడొద్దు'

కేటీఆర్‌తో ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, జనవరి 31: ప్రజా సమస్యల పరిష్కారానికై ఉద్యమించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు వెనుకాడొద్దని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా దవాఖానకు శంకుస్థాపన చేయడంతో పాటు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆనంద్‌కుమార్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ఉద్యమించడానికి కార్యకర్తలు ఎల్లవేళలా ముందుండాలని కేటీఆర్ సూచించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు అరెస్టులు, కేసులకు భయపడవద్దని పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో సాయికుమార్

గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఫీషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్. – అబిడ్స్, జనవరి 31

ప్రజలకు సేవచేయడానికి ముందుకు రావాలి

ప్రజలకు సేవలందించడానికి ముందుకు రావాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. గోల్కొండలోని వివిధ రంగాలలో అవార్డులు పొందిన పలువురికీ ఎంఐఎం నాయకులు గులాం మోహినుద్దీన్ పాషా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి అవార్డు గ్రహీతలను సన్మానించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.
– మెహిదీపట్నం, జనవరి 31

అంచెలంచెలుగా నియోజకవర్గం అభివృద్ధి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కోరంటి చౌరస్తాలో సెంట్రల్ మీడియా పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జనవరి 31 : అంబర్‌పేట నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ఫీవర్ చౌరస్తా నుంచి రత్నానగర్ వరకు రూ.44.50లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సెంట్రల్ మీడియా పనులను శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీసీ, బీటీ, వీడీసీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మంచినీటి, డ్రైనేజీ, వర్షపునీటి పైప్‌లైన్ల ఏర్పాటు, పార్కుల సుందరీకరణ వంటి అభివృద్ధి పనులను ఇప్పటికే చేపట్టడం జరిగిందన్నారు. కోరంటి దవాఖాన చౌరస్తా నుంచి రత్నానగర్ వరకు సెంట్రల్ మీడియా పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఓల్డ్ రామాలయం వీధిలో స్థానికులు వర్షపునీటితో తాము పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నాలా నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. అయితే నాలాలో నుంచి 33/11 కేవీ అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ వెళ్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పడంతో సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. తగిన ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టెలిఫోన్ కమిటీ సభ్యుడిగా నర్సింగ్‌యాదవ్

కాచిగూడ, జనవరి 31: ప్రజల కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్‌ను భారత ప్రభుత్వం కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ హైదరాబాద్ టెలిఫోన్ కమిటీ సభ్యుడిగా నియమించారు. సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోల్నాకలో నర్సింగ్‌రావు యాదవ్‌ను అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.కృష్ణంరాజు, శ్రీధర్‌గౌడ్, రవీందర్‌రావు, రమేశ్, డీఆర్ఎన్ నరేంద్ర, ప్రకాశ్‌రెడ్డి, కె.కృష్ణ, అనిల్‌కుమార్, సంతోష్‌వర్మ, వంశీకృష్ణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ గౌతంరావు తదితరులు

ఉద్యోగ విరమణ



అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు అన్నారు. కాచిగూడ డిపోలో డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బి.జకరయ్యను డిపో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జకరయ్య దంపతులను సన్మానించారు.
– కాచిగూడ, జనవరి 31

అన్నదానం

అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్‌బజార్, జనవరి 31: టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన, నిలోఫర్ దవాఖాన, బసవ తారకం క్యాన్సర్ దవాఖాన ఆవరణలలో సుమారు 3 వేల మంది పేద రోగి సహాయకులకు అన్నదానం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. కీర్తి శేషులైన తల్లి దండ్రుల పేరిట పేద రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ కోశాధి కారి సయ్యద్ అసదుద్దీన్, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, జిల్లా శాఖ సభ్యులు వైదిక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషీ, నాల్గవ తరగతి కేంద్ర సంఘం గౌరవ అధ్యక్షుడు ఖాదర్ బిన్ హసన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి.. సమరభేరి

సుగుణవతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ, జనవరి 31: బీసీల సమస్యల పరిష్కారానికి తెలంగాణలోని గ్రామ గ్రామాన సమరభేరి కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధానకార్యదర్శిగా చెరుకుల సుగుణవతిని నియమిస్తూ నియామక పత్రాన్ని ఆర్. కృష్ణయ్య అందజేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రం ఎస్సీ అట్రాసిటీలాగ బీసీ అట్రాసిటీని తీసుకురావాలని, రానున్న రోజుల్లో దేశంలో బీసీ విప్లవం తప్పదని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జనాభా దమాషా ప్రకారం బీసీలకు రిజర్వేన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, వేముల రామకృష్ణ, రాజేందర్, జయంతిగౌడ్, శివమ్మ, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంగీతం, సాహిత్యం మేళ విందుగా జోసెఫెస్టా

తెలుగు యూనివర్సిటీ, జనవరి 31 : విభిన్న సంస్కృతులకు నిలయంగా మారిన హైదరాబాద్ చరిత్రను మరింతగా ఇనుమడింపజేసేల విద్యార్థినీవిద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలోని అద్భుతమైన సాహిత్యంతో కూడిన పాటలకు తమదైన శైలిలో ఆడిపాడారు. కింగ్‌కోఠిలో గల సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జోసెఫెస్టా–2025 కార్యక్రమం ఆద్యంతం హోరెత్తింది. సృజనాత్మక కళాప్రతిభతో సంగీతానికి అనుగుణంగా పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ రోజంగా గడిపారు. నగరంలోని పలు అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ వేడుకలలో పాల్గొని ఉత్సాహభరితమైన వాతావరణంలో ఎంజాయ్‌చేశారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే యువతీ యువకులు పురివిప్పిన నెమలుల వలే నృత్యాలు చేసి సహచరులను ఊర్రూతలూగించారు. కళాశాల కరస్పాండెంట్ కె. మారెడ్డి, ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, వైస్ ప్రిన్సిపాల్ అంబటి ప్రణీత జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సంగీతానికి అనుగుణంగా నృత్యం చేస్తున్న యువతులు

ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ సభ్యుడుగా చిరంజీవి

హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడుగా కాచిగూడ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చిరంజీవి శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్లు ప్రసాద్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య గంగపుత్ర, సిబ్బంది ప్రిన్సిపాల్ చిరంజీవిని సన్మానించారు.
– కాచిగూడ, జనవరి 31

బాపూనగర్‌లో అభివృద్ధి పనులు

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ బాపూనగర్‌లో ఉన్న స్తంభాల మైసమ్మ ఆలయం వద్ద శుక్రవారం జీహెచ్ఎంసీ, జల మండలి అధికారులు డ్రైనేజీ, రోడ్ల మరమ్మతు పనులను చేపట్టారు. ఈ పనులను ఎంఐఎం నాయకుడు వజీ ఉజ్జమా, ఏఈ ఫరీద్, ఆలయ కమిటీ చైర్మన్ కారింగుల గోపి గౌడ్ పర్యవేక్షించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని అన్నారు.
– మెహిదీపట్నం, జనవరి 31

భోజగుట్టలో కుంగిన పైపులైన్

మరమ్మతు పనులు చేపడుతున్న అధికారులు

సిటీ బ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): భోజగుట్టలో 250 ఎంఎం డయా పైపులైన్ కుంగి మూడు మీటర్ల మేర గొయ్యి ఏర్పడింది. భోజగుట్ట నుంచి ఖాదర్‌బాగ్, సాలార్‌జంగ్ కాలనీ, మిలిటరీ ఏరియా అవుట్ లెట్ వరకు ఉన్న పైపులైన్ టన్నెలింగ్ పనులు చేస్తుండగా అధికారులు లీకేజీని గుర్తించారు. ఎండీ అశోక్‌రెడ్డి లీకేజీ వ్యవహారంపై స్పందించారు. పనులు జరిగే ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలని సూచించారు. త్వరితగతిన పూర్తి చేసి పైపులైన్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. అప్రమత్తమైన జలమండలి అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

బీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 21వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడొచ్చని తెలిపారు.

ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ/ఎంబీఏ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీ వన్‌టైం చాన్స్ పరీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంసీజే, ఎంలిబ్ఎస్సీ కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్‌టైం చాన్స్ పరీక్షలను ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

కాచిగూడ, జనవరి 31: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65)శుక్రవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గోధుమ రంగు చొక్క, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి.ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 9948695948లో సంప్రదించాలని కోరారు.

షకీల్ హసన్ ఖాన్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి

● కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలమ్మ

కోఠిలోని డీహెచ్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురిలు మహాలమ్మ అన్ని జిల్లాల సభ్యులు

సుల్తాన్‌బజార్, జనవరి 31 : రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగిణులకు రక్షణ కరువైందని పీహెచ్ అండ్ ఎంఈ హెల్త్ నర్సెస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో కామపిశాచి షకీల్ హసన్ ఖాన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె, హెచ్–1 యూనియన్ అధ్యక్షుడు కర్నాటి సాయి రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రసూతి దవాఖానలలో అతిపెద్దదైన పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న షకీల్ హసన్ ఖాన్ రాసలీలల బాగోతంపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే అతడిని విధుల నుంచి బహిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. 'హసన్ ఖాన్ దవాఖానలో ఇప్పటికే 23 మందితో లైంగికంగా కలిశా.. ఇంకా ఇద్దరు ఐతే సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తా' అని ఓ నర్సుతో అంటే సదరు నర్సు భయభ్రాంతులకు గురై హసన్ ఖాన్ ఆగడాలు శృతిమించాయని తనను కాపాడాలని సోషల్ మీడియాలో ఆ నర్సు ఆవేదన వ్యక్తం చేయడం భయాందోళనకు గురి చేస్తుందని అన్నారు. అయినప్పటికీ ఉన్నతాది కారులు పట్టించుకోక పోవడం శోచనీయమని ఆమె ఆగ్రహం వ్యక్త చేశారు. ఇటు వంటి కీచకులను తక్షణమే విధుల నుంచి డిస్‌మిస్ చేయాలని అన్నారు. రెండు రోజులలో హసన్ ఖాన్‌ను విధుల నుంచి బహిష్కరించక పోతే పెద్దెత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని ఆమె హెచ్చరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ప్రమీల, సంయుక్త కార్యదర్శి కుర్షీదా బేగం, మీడియా ప్రచార కార్యదర్శి ప్రభావతితో పాటు అన్ని జిల్లాల నుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

చెట్లకొమ్మలు తొలగింపజేస్తున్న కార్పొరేటర్ బి.పద్మారెడ్డి

అంబర్‌పేట, జనవరి 31: బాగ్‌అంబర్‌పేట డివిజన్ నందనవనం కాలనీలో ఉన్న వీధి దీపాలకు చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. ఈ విషయం కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దృష్టికి రావడంతో శుక్రవారం ఆమె ల్యాడర్‌ను తెప్పించి చెట్లకొమ్మలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్, ప్రదీప్, ఉద్యానవన శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, నాయకులు మిర్యాల శ్రీనివాస్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాకు చిక్కుకొన్న పావురం..

డీఎస్ఎస్ భవనం మధ్యలో వేలాడుతున్న పతంగుల దారానికి పావురం చిక్కుకుపోయి విలవిలలాడుతోంది. ఉదయమే సంక్షేమ భవన్‌లో పనులు చేసేందుకు వచ్చిన బోరబండకు చెందిన రాజు, తోటి కార్మికుడు అనిల్‌తో కలిసి సుమారు 25 నిముషాలు శ్రమించి దారానికి చిక్కుకొన్న పావురాన్ని విడిపించారు.

చైనా మాంజాకు చిక్కుకొని విలవిలలాడుతున్న పావురాన్ని రక్షించి మానవత్వాన్ని చాటుకున్నాడో సఫాయి కార్మికుడు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్
– అబిడ్స్, జనవరి 31

పేదల బతుకులు రోడ్డుపాలు

● నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో దుకాణాల కూల్చివేత
● సామాన్లు తీసుకోవడానికి కూడా సమయం ఇవ్వని అధికారులు

అంబర్‌పేట, జనవరి 31: నల్లకుంట డివిజన్ శంకరమఠం కూరగాయాల మార్కెట్‌లో రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారంటూ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మొత్తం కూరగాయల దుకాణాలను జేసీబీలను పెట్టి తొలగించారు. తమ దుకాణాల్లో ఉన్న సామాన్లను తీసుకొని పక్కకు పెట్టుకుంటామని బతిమిలాడిన సమయం ఇవ్వకుండా కర్కషంగా తీసివేశారు. దుకాణాల పైన ఉన్న తడకల షెడ్లను జేసీబీలతో పడగొట్టేశారు. పూలు, పండ్లు, కూరగాయలు రోడ్డుపాలయ్యాయి. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, నల్లకుంట పోలీసుల నేతృత్వంలో ఈ దుకాణాలు తొలగించారు. 80 ఏండ్ల కిందట ఏర్పాటైన ఈ కూరగాయాల మార్కెట్‌లో ఒక్క దుకాణం లేకుండా చేశారు.

80 ఏండ్ల నుంచి వ్యాపారాలు..

80 ఏండ్ల నుంచి ఇక్కడ కూరగాయల దుకాణాలు, పూలు, పండ్ల దుకాణాలు పెట్టుకొని జీవనం పొందుతున్నామని బాధితులు వాపోయారు. ఆకస్మాత్తుగా వచ్చి దుకాణాలను తొలగించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ బతుకులను రోడ్డు పాలు చేసిందని ఆవేదన చెందారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినదించారు. తిట్టి శాపనార్థాలు పెట్టారు. దుకాణాల్లో ఉన్న కూరగాయలు, పండ్లు, పూలు తీసుకుంటామన్నా టైమ్ ఇవ్వకుండా తొలగించారని, మొత్తం సామాన్లను రోడ్డున పడేశారని కొందరు మహిళలు విలపించారు. అయితే స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే తాము ఉన్న తాధికారుల ఆదేశాలను అనుసరించి తొలగించామని అధికారులు చెప్పారు.

సామాన్లు తీసుకోనివ్వలేదు

అప్పుడే పూలు మార్కెట్ నుంచి వచ్చాయి. కిందకు దించి జమాయించుకుంటున్నాం. జేసీబీతో వచ్చి దుకాణాన్ని కూల్చివేశారు. కనీసం సామాన్లు కూడా తీసుకోనివ్వలేదు.
–సునీత, పూల వ్యాపారి

మా బతుకులు రోడ్డుపాలు చేశారు

మా తాత ముత్తాతల నుంచి ఇక్కడే పూలు అమ్ముకొంటున్నాం. ఇంత అన్యాయమా? నాకు పక్షవాతం. ఇద్దరు ఆడపిల్లలు. కిరాయి ఇంట్లో ఉంటున్నాను. ఎట్లా బతికేదీ? వీళ్లు ఇట్లా చేస్తారని ఎప్పుడు ఊహించలేదు. మా బతుకులు రోడ్డు పాలు చేశారు.
–మల్లేశ్, పూల వ్యాపారి

PUBLIC NOTICE

The General Public is hereby informed that, my client is intends to purchase the Residential Flat, bearing **Flat No. 302, Third Floor,** Corresponding to GHMC No. 2-2-647/153 & 155 (P)/302 (PTIN/Assessment No. 1090230739), having its built-up area of **990 Sft.** including common areas and Car Parking area in Stilt Floor, together with undivided share of land **44.85 Sq.yards** out of 361.6 Sq.yards, the complex known as **"GOLDEN TOWERS-NEST"** bearing Municipal Nos. 2-2-647/153 & 2-2-647/155 (Part), situated at **Central Excise Colony,** Bagh Amberpet, Hyderabad, under GHMC and bounded by: **NORTH: OPEN TO SKY, SOUTH: OPEN TO SKY, EAST: CORRIDOR AND STAIRCASE, WEST: OPEN TO SKY** from Sri Pulasani Puneeth Reddy, S/o. Pulasani Ravi Kanth Reddy, that my client has entered into Agreement of Sale and paid substantial amount towards advance-cum-part payment of sale consideration.

Any person(s) / Bank(s) / Financial Institution(s) / Chit Funds etc., or any sort of objections, claims, right, title or interest in whatever nature in respect of the above said Plot / property, they may contact the undersigned along with the original relevant / authenticated documents, about their claims, within (7) days from the date of publication of this Public Notice. Thereafter, my clients shall proceed and complete the sale transactions and any claims or objections received after the above said period shall be deemed to have been waived.

Sd/- PENTAM SATYANARAYANA, Advocate
Off: # 304, Third Floor, Sai Pragathi Plaza, Nallakunta Main Road, Hyderabad-500 044,
Cell # 9885458822,
Email: psnadvocate2090@gmail.com
Place: Hyderabad, Date: 31-01-2025.